కాచిగూడ - త్రివేండ్రం మీదుగా ప్రత్యేక రైలు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 16: కాచిగూడ - త్రివేండ్రం, కొచ్చివేలి - కాచిగూడకు కడప మీదుగా ప్రత్యేక రైలు (07229/07230)ను నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. ఈనెల 18, 25 తేదీలలో కాచిగూడలో ఉదయం 6.05కు రైలు బయల్దేరుతుందన్నారు. ఈ రైలు మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు, గుత్తి మీదుగా అదే రోజు మధ్యాహ్నం 1.50కి చేరుకుంటుందని.. కడపకు 2.25 గంటలకు చేరుకుని రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, తిరుపూర్, కోయంబత్తూరు, ఎర్నాకులం, కొట్టాయం, కొల్లాం మీదుగా త్రివేండ్రం, కొచ్చివేలికి శుక్రవారం ఉదయం 10.05 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో కొచ్చివేలిలో శుక్రవారం మధ్యాహ్నం 12.50కి ఈనెల 19, 26 తేదీలలో బయల్దేరి శనివారం ఉదయం 6.25కు కడపకు, 7గంటలకు ఎర్రగుంట్లకు చేరుకుని అదే రోజు సాయంత్రం 5 గంటలకు కాచిగూడ చేరుకుంటుందన్నారు. ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఈ ప్రత్యేక రైలు వేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సివిల్స్‌లో మెరిసిన నందలూరు వాసి

- గొబ్బిళ్ల కృష్ణ శ్రీవాస్తవ్‌కు 444వ ర్యాంకు


గొబ్బిళ్ల కృష్ణ శ్రీవాస్తవ్

నందలూరు, ఏప్రిల్ 16: యూపీఎస్‌సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో గొబ్బిళ్ల కృష్ణ శ్రీవాస్తవ్ 444వ ర్యాంకు సాధించి నందలూరు కీర్తిప్రతిష్ఠలు పెంపొందించాడు. నందలూరులోని గొబ్బిళ్ల శంకరయ్య పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశాడు. గుంటూరు ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్మీడియట్, అనంతపూర్‌లోని జేఎన్టీయూ బీటెక్ మెకానికల్ బ్రాంచ్‌ను పూర్తి చేశాడు. చెన్నైలోని శంకర్ ఐఏఎస్ అకాడమీలో సివిల్స్‌లో శిక్షణ పొందాడు. 2023వ సంవత్సరంలో విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌గా ఎంపికై ప్రస్తుతం తాడేపల్లిగూడెంలో విధులు నిర్వహిస్తున్నాడు. అక్క గొబ్బిళ్ల విద్యాధరి నెల్లూరు జిల్లాలోని కందుకూరులో సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బావ కొతారి సోమశేఖర్ అప్పారావు పుదుచ్చేరిలో సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి సుజాతమ్మ, అక్క విద్యాధరి ప్రోత్సాహంతోనే సివిల్స్‌లో తాను ర్యాంకు సాధించానని ఈ సందర్భంగా కృష్ణ శ్రీవాస్తవ్ తెలిపారు.

ధనంజయకుమార్‌కు 810వ ర్యాంకు


కుటుంబ సభ్యులతో ధనంజయకుమార్

కడప క్రైం, ఏప్రిల్ 16 : కడపలోని ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ధనంజయకుమార్ సివిల్స్‌లో 810వ ర్యాంకు సాధించారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిగారిపల్లి భీమ్‌నగర్‌కు చెందిన కృష్ణయ్య, ముత్యాలమ్మ దంపతుల కుమారుడైన వీరు పులిచెర్ల మండలంలోని కల్లూరు శారదా విద్యామందిర్‌లో 5వ తరగతి వరకు చదువుకున్నారు. మదనపల్లె సమీపంలోని వలసపల్లి జవహర్ నవోదయలో 6నుంచి ఇంటర్ వరకు చదువుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తిలోని స్కిట్ కళాశాలలో ఈఈఈ గ్రూపులో బీటెక్ పూర్తిచేశారు. 2011వ సంవత్సరంలో విశాఖ ఉక్కు కర్మాగారంలో మేనేజర్‌గా చేరి సుమారు ఏడేళ్ల పాటు పనిచేశారు. 2016వ సంవత్సరంలో గ్రూప్-1 పరీక్ష రాసి 2018లో ఎక్సైజ్‌శాఖలో సూపరింటెండెంట్ ఉద్యోగం సాధించారు. మొదట అనంతపురంలో పనిచేసి ప్రస్తుతం కడపలో పనిచేస్తున్నారు. ఉద్యోగం చేస్తూనే కోచింగ్ తీసుకోకుండా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రిపేరయ్యారు. తాజాగా విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 810వ ర్యాంకు సాధించారు.



అంబేడ్కర్ ఆశయాలతో ముందుకెళతా..

ఐఏఎస్ సాధించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నా. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకెళతా. పేద విద్యార్థులను విద్యాపరంగా ఆదుకోవాలనుకుంటున్నా.

- ధనంజయకుమార్, 810వ ర్యాంకర్

కడపలో.. పులివెందుల ఫార్ములా!

- వైసీపీ అసమ్మతి నేతలకు ఆమ్యామ్యాలు
- రూ.5 లక్షల నుంచి 15 లక్షల వరకు నజరానా
- కార్పొరేటరుకు రూ.10 లక్షల నుంచి 15 లక్షలు
- అసంతృప్తి వాదుల కోసం నేరుగా ఎంపీ అవినాష్‌రెడ్డి రంగంలోకి..
- వినకపోతే ఫోనులో సీఎం జగన్‌తో మాట్లాడించడం
- ఇదీ కడప వైసీపీ మార్కు పాలిటిక్స్



(కడప - ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ కాంగ్రెస్‌ను వీడి వైసీపీ స్థాపించిన తరువాత అప్పటి వరకు కాంగ్రెస్‌లో ఉన్న నేతలంతా జగన్‌కు జై కొడుతూ వైసీపీలోకి జంప్ అయ్యారు. 2011 ఉప ఎన్నికల్లో జగన్ కడప పార్లమెంటు నుంచి పోటీ చేస్తే కడప అసెంబ్లీలో భారీ ఆధిక్యత వచ్చింది. ఇక 2014 ప్రథమార్థంలో జరిగిన కడప కార్పొరేషన్, అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి పట్టం కట్టారు. కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ గెలుపొందగా.. అప్పట్లో తొలి మేయరుగా సురేష్‌బాబు ఎన్నిక కాగా, అంజద్‌బాషా తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. అయితే అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ఉండేది. దీంతో మన ప్రభుత్వం లేదు, చంద్రబాబు అధికారంలో ఉన్నాడు.. మనం ఏమీ చేయలేమంటూ టీడీపీపై నెపం నెట్టారు.

వాస్తవంగా 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ కూడా కార్పొరేషన్‌లో వైసీపీదే హవా. ఇష్టారాజ్యంగా జనరల్‌ఫండ్, ఇతరత్రా వాటిని వాడేసుకున్నారు. అప్పట్లో కేంద్ర ఆర్థిక సంఘం నిధులను కూడా టీడీపీ ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా కార్పొ రేటర్లకే ప్రయార్టీ ఇచ్చిందంటారు. కేవలం రాష్ట్రం ఇచ్చే ప్రత్యేక నిధులు మాత్రమే టీడీపీ నాయకులు చేశారంటారు. అయితే తమ ఇష్టమైన నాయకుడు జగన్ సీఎం అయిన తరువాత 2019 నుంచి కొందరు కార్పొరేటర్ల పరిస్థితి జీరో అయిందంటారు. టీడీపీ హయాంలో వాళ్ల డివిజన్‌లో హీరోలుగా వెలిగిన కార్పొరేటర్లు జగన్ పాలనలో జీరో అయ్యారంటారు. జగన్ సీఎం అయిన తరువాత పార్టీ పదవులు, అభివృద్ధి పనులు కేవలం కొందరికే.. ఓ సామాజిక వర్గానికే ప్రయార్టీ ఉందంటారు. జగన్ కోసం అప్పులు చేసి.. ఆస్తులు అమ్ముకుని కష్టపడే వారికి గుర్తింపు లేదని వాపోతారు. అందుకే ఇప్పుడు సరిగ్గా ఎన్నికల వేళ కొందరు కార్పొరేటర్లు, కీలక వైసీపీ నేతలు మాకేంటి అంటూ చేతులెత్తేశారు. అధికారం లేనప్పుడు సొంత ఖర్చులు పెట్టుకుని పార్టీ జెండా మోశాం. అధికారంలోకి వచ్చిన తరువాత మమ్మల్ని వదిలేసి.. కేవలం ఒక సామాజిక వర్గం కార్పొరేటర్లకే పదవులు , ప్రయార్టీ ఇచ్చారని వాపోతున్నారు.

అలా వదిలేశారంటారు..

వైసీపీ 49 నెలల పాలనలో కడపలో కొందరు వైసీపీ నేతలు లబ్ధి పొందారంటారు. ఇక్కడ కూడా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లిఖార్జునరెడ్డిలు వర్గాలుగా విడిపోయారు. మొన్నటి వరకు ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి వ్యతిరేకంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబు ఉండేవారంటారు. వీరి అనుచరులుగా కార్పొరేటర్లు ఉండేవారంటారు. ఇక వైసీపీ అధికారం వచ్చాక డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబులదే హవా సాగినట్లు చెబుతారు. విధి లేని పరిస్థితుల్లోనే కొద్దిగొప్పో ఎమ్మెల్యే రవిరెడ్డి అనుచర కార్పొరేటర్లకు ప్రయార్టీ తప్పనిసరి పరిస్థితిలో ఇచ్చారంటారు. మిగతా వారందరినీ అలా వదిలేసినట్లు చెబుతారు. కార్పొరేటరునే కాదు.. వైసీపీ జెండా మోసిన కీలక నేతలను, వంద ఓట్లను ప్రభావితం చేసేవారిని కూడా వదిలేశారంటారు. దీంతో ఆ కేడరంతా పార్టీపై గరం గరంగా ఉందంటారు.

పులివెందుల ఫార్ములా..

సీఎం జగన్ సొంత నియోజకవర్గంలో అసంతృప్త నేతలకు క్యాష్ కొడుతున్నారన్న ప్రచా రం ఉంది. అంటే గ్రామస్థాయిలో రూ.50వేల నుంచి మొదలుకుని లక్షా, రెండు లక్షలు, 30 లక్షల వరకు అంటే పాడా పరిధిలో ఎలాంటి కాంట్రాక్టు పనులు తీసుకోని వారికి నిధులు ఇప్పటికే పంచారని ప్రచారం ఉంది. ప్రతి ఊరిలో భారీ ఎత్తున రూ.50 వేల నుంచి 20 లక్షల వరకు కార్యకర్త స్థాయిని బట్టి ఇచ్చారని ప్రచారం ఉంది.



అదే ఫార్ములాను జమ్మలమడుగులో అమలు చేశారంటారు. తరువాత ప్రొద్దుటూరులో కూడా అమలు చేసినట్లు చెబుతారు. అయితే ఇప్పుడు కడపలో కూడా అమలు చేస్తున్నట్లు చెబుతారు. కడప కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లు ఉంటే 40 డివిజన్లను వైసీపీ గెలుచు కుంది. ఒక డివిజన్ టీడీపీ ఇండిపెండెంట్ గెలుచుకుంది. ఇండిపెండెంట్ అభ్యర్థి వైసీపీలో చేరారు. కడప వైసీపీ కేడరు అంతా జగన్ సీఎం అయితే మా భవిష్యత్తు మారిపోతుం దంటూ త్రీడీ లెవల్‌లో ఊహించుకున్నారు. జగన్ సీఎం అయ్యాక వారికి తెలిసింది కాంట్రాక్టు పనులు, సిఫారసులు, కార్పొరేషన్ పదవులు ఇతరత్రా కేవలం ఒక బ్యాచ్‌గా అని తెలిసిపోయింది. దీంతో పార్టీ కోసం కష్టపడ్డ వారిలో అసహనం పెరిగింది. ఈ సారి వైసీపీకి ఓటు వేయకూడదని డిసైడ్ అయ్యారు. దీన్ని పసిగట్టిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అండ్ గ్యాంగ్‌తో బుజ్జగింపులకు ప్రయత్నిస్తున్నట్లు చెబుతారు. అసంతృప్తులను బుజ్జగించేందుకు పంచతంత్రాన్ని వాడుతున్నట్లు చెబుతున్నారు.

బుజ్జగింపులకు దిగుతున్నారు...

డివిజన్‌లో ఎవ రైనా కీలక నేత అసంతృప్తిగా ఉంటే స్థానిక నేతతో బుజ్జగించడం, లేదంటే కార్పొరేటరు అది కాకపోతే మేయరు ఇంకా సరిపోదంటే డిప్యూటీ సీఎం, ఎంపీ అవినాష్‌రెడ్డిలతో నేరుగా మాట్లాడుతున్నారని అంటున్నారు. అయితే మేయరు, డిప్యూటీ సీఎం అంజద్ బాషాల బుజ్జగింపులతో పలువురు కార్పొరేటర్లు, నేతలు తీవ్రస్థాయిలో రియాక్ట్ అవుతు న్నట్లు తెలుస్తుంది. పార్టీ కోసం కష్టపడితే మమ్మల్ని వదిలేశారంటూ ఆవేదన వెల్లగ క్కుతూ.. మాకు ఎలాంటి అప్పులు లేవు, మీ పార్టీ కోసమే చేశామంటూ పలువురు నిర్మోహమాటంగా చెబుతున్నారు. ఐదేళ్ల నుంచి మమ్మల్ని పట్టించుకోలేదు. మాకు విలువ లేదు, మమ్మల్ని చీప్‌గా చూశారు. ఇప్పుడు మీకు ఓటు అవసరం కాబట్టి వచ్చారు. మమ్మల్ని స్థానికంగా నాశనం చేశారంటూ నిలదీయడంతో ఖంగుతిన్న నేతలు బుజ్జగింపులకు శ్రీకారం చుట్టారంటారు. స్థాయిని బట్టి లక్ష నుంచి 10 లక్షలు ఇస్తున్నట్లు చెబుతున్నారు. సత్తా ఉన్న కార్పొరేటర్లకు రూ.10 నుంచి 15 లక్షలు ఇచ్చే ప్యాకేజీ ఉన్నట్లు కడపలో జోరుగా చర్చ నడుస్తోంది.

ఐసీసీ సేవలను పక్కాగా నిర్వహించాలి

- కలెక్టర్, ఎన్నికల అధికారి విజయరామరాజు


కమాండ్ కంట్రోల్ సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 16: జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ సేవలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి విజయరామరాజు ఇంటిగ్రేటెడ్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వెళ్లే ప్రతి రిపోర్టును భద్రపరచుకోవాలన్నారు. అధికారులు సిబ్బందికి కేటాయించిన విధులను విధిగా చేపట్టాలన్నారు. కంట్రోల్ రూమ్ సిబ్బందికి ప్రణాళికా ప్రకారం షిఫ్ట్‌ల డ్యూటీలను కేటాయించి నిత్యం మానిటర్ చేయాలని, అలాగే రిపోర్టులను సకాలంలో అం దించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనరు ప్రవీణ్‌చంద్, ఎంసీఎంసీ సీజర్స్, ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ కమిటీల నోడల్ అధికారులు, సోషల్‌మీడియాసెల్ కమాండ్ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ హామీలన్నీ గాల్లోనే..

- 10 శాతం కూడా హంద్రీ-నీవా పనులు చేయలేదు
- చేనేత ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ ఏమైంది
- టమోటా కోల్డ్ స్టోరేజీలు ఎక్కడన్నా..
- రబ్బరు స్టాంపులా పీలేరు ఎమ్మెల్యే చింతల
- పీలేరును తమ రాజ్యంలా మార్చుకున్న పెద్దిరెడ్డి కుటుంబం
- న్యాయ్‌యాత్రలో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల


పీలేరులో జరిగిన సభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

మదనపల్లె అర్బన్/ పీలేరు, ఏప్రిల్ 16: మదనపల్లె ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ గాల్లో కొట్టుకుపోయాయని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. న్యాయ్ యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం మదనపల్లెకు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక బెంగళూరు బస్టాండులోని బహిరంగ సమావేశంలో షర్మిల మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ చేపట్టిన పాదయాత్రలో, ఎన్నికల సందర్భంగా ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. జగన్ ఇచ్చిన హామీలన్నీ గాల్లో కొట్టుకుపోయాయంటూ విమర్శించారు. హంద్రీ-నీవాను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికున్నప్పుడు 90 శాతం పూర్తి చేయగా, మిగిలిన పదిశాతాన్ని ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో చేనేతలు ఎక్కువగా ఉన్నారని, వీరి చేనేత ఉత్పత్తులకు గిట్టుబాటు ధరతో పాటు ఇక్కడ తయారయ్యే చీరలకు కల్పిస్తానన్న బ్రాండ్ ఇమేజ్ ఏమైందని జగన్‌ను ప్రశ్నించారు. మదనపల్లె చుట్టూ ఏర్పాటు చేస్తానన్న ఔటర్ రింగురోడ్డు ఏమైందని, అది కూడా ఫ్యాన్ గాలికి కొట్టుకుపోయిందా? అంటూ నిలదీశారు. పడమటి మండలాల్లో ఎక్కువగా పండించే టమోటా రైతును ఆదుకునేందుకు టమోటాకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ధరలు హెచ్చు తగ్గులు ఉన్నప్పుడు టమోటాను నిల్వ చేసి ధరలు వచ్చాక అమ్ముకునేందుకు వీలుగా కోల్డ్‌స్టోరేజీలు నిర్మిస్తామని, టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్న జగన్ వీటిలో ఒకటైనా నెరవేర్చారా? అంటూ ప్రశ్నించారు. మదనపల్లె తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఉద్దేశించిన సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులు, వాటి మొరవలు కూడా పూర్తిచేయలేదన్నారు. మదనపల్లె కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.రెడ్డిసాహెబ్, సీపీఎం నాయకుడు పి.శ్రీనివాసులు, ఆమ్‌ఆద్మీపార్టీ నాయకుడు రహీమ్ మాట్లాడారు. షర్మిల సాయంత్రం 6:45 గంటలకు చేరుకుని 7:30 గంటల వరకూ ప్రసంగించారు. ఆమె మాట్లాడుతున్నంత సేపు భారీగా చేరుకున్న ప్రజలు ఆమెకు జేజేలు పలికారు. ఇక్కడి సమావేశం అనంతరం రోడ్‌షోగా బి.కొత్తకోటకు వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్కే బాషా, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి, నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

రబ్బరుస్టాంపులా చింతల

- పెత్తనమంతా పెద్దిరెడ్డి కుటుంబానిదే

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలు పీలేరును తమ రాజ్యంగా మలుచుకుని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని రబ్బరు స్టాంపుగా మార్చి వేశారని వైఎస్ షర్మిల ఆరోపించారు. న్యాయ్‌యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం ఆమె పీలేరుకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. మంత్రి, ఎంపీలు చేసే అవినీతి పనులకు ఎమ్మెల్యే చింతల గంగిరెద్దులా తలూపాల్సిందేనని, లేకపోతే వారు చింతలను బతకనివ్వరని ఆరోపించారు. వైసీపీ హయాంలో పీలేరు నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. గత ఎన్నికల సందర్భంగా వారు హామీ ఇచ్చిన విధంగా టమోటా రైతులకు ఎటువంటి సాయం అందించలేదన్నారు. టమోటా పల్ప్ పరిశ్రమ, ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజ్ వంటి హామీలను నెరవేర్చలేదన్నారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న జగన్

సొంత బాబాయిని హత్య చేసిన వైఎస్ అవినాశ్‌రెడ్డికి మళ్లీ కడప ఎంపీ టిక్కెట్టు ఇచ్చి హత్యా రాజకీయాలు, హంతకులను జగన్ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. జగన్ కారణంగా రాష్ట్రంలో ల్యాండ్, శ్యాండ్, మైన్స్, వైన్ మాఫియా నడుస్తోందని, రాజకీయాలను ఆ నాలుగు మాఫియాలు శాసించే దుస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ఆంధ్రప్రదేశ్ సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని షర్మిల పేర్కొన్నారు. పీలేరు అసెంబ్లీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న బాలినేని సోమశేఖర రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిని కూడా త్వరలోనే ప్రకటిస్తామని, ఆయనను కూడా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లాబకష్, నజీర్ అహ్మద్, అమృతతేజ, దుబ్బా శ్రీకాంత్, సంపత్, శ్రీవర్ధన్ చౌదరి, ఫయాజ్, రహంతుల్లా, యూసుఫ్ అలీ, ఇమాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల్లో టెన్షన్..టెన్షన్

వైఎస్ షర్మిల పర్యటన సందర్భంగా పీలేరు పోలీసుల్లో టెన్షన్ నెలకొంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా షర్మిల సభ జరిగిన బస్టాండు ఎదుట ఉన్న వేర్‌హౌస్ గోడౌన్ షాపింగ్ కాంప్లెక్స్‌ను పోలీసులు తమ అధీనంలోకి తీసుకుని గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా నేతృత్వంలో పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో పీలేరు, కలకడ, వాల్మీకిపురం సర్కిళ్ల పరిధిలోని ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.


మదనపల్లెలో జరిగిన న్యాయ్ యాత్రలో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

కోదండరాముడే.. వచ్చేనురా..

- బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ
- నేడు ధ్వజారోహణం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ
- విద్యుద్దీపకాంతుల్లో మెరిసిపోతున్న ఆలయం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 16: ఆంధ్రా అయోధ్య ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. మంగళవారం ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మూలవరులకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేపట్టారు. సాయంత్రం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలశప్రతిష్ఠ, కలశపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ చేశారు. అనంతరం అర్చకులు రామాలయంలోని పుట్ట నుంచి పుట్టమన్ను శాస్త్రీయంగా సేకరించి రామాలయ ప్రాంగణంలోని హోమగుండంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో కేరళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయం విద్యుద్దీపాల కాంతిలో మెరిసిపోతోంది. విద్యుత్ కాంతుల్లో ఏర్పాటు చేసిన దేవతల కటౌట్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆలయంలోని రంగమండపాన్ని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.


రంగమండపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నేడు ధ్వజారోహణం

కోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఉదయం 10.30గంటల నుంచి 11 గంటల మధ్య మిధున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శేషవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు నటేష్ బాబు, ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.


పుట్ట మన్ను సేకరిస్తున్న అర్చకులు


పుట్ట మన్ను తీసుకొస్తున్న అర్చకులు


ప్రత్యేక అలంకరణలో ఉన్న రంగమండపం


ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు


కేరళ కళాకారుల ప్రదర్శన

కడప జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

● లోకాయుక్త ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 16: కడప జిల్లాలోని రెండు మండలాల్లో ఒక రాజకీయ నాయకుడు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నాడంటూ వచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర లోకాయుక్త స్పందించింది. లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం దిగి వచ్చి సదరు ఆక్రమణలను అరికట్టింది. కడప జిల్లాలోని పోరుమామిళ్ల మండలంలోని శ్రీ అవధూత కాశిరెడ్డినాయన మండలాల్లో పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అనే రాజకీయ నాయకుడు, అతడి కుటుంబీకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వాటిని రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడనీ దళిత్ కమిటి పీపుల్ అనే సంస్థ రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లోకాయుక్త కడప జిల్లా కలెక్టర్‌కు గతంలో ఆదేశించింది. ఈ మేరకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం సదురు అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ఆక్రమణలను అరికట్టినట్లు రాష్ట్ర లోకాయుక్తకు తమ నివేదికలో తెలియజేశారు. దీంతో సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లోకాయుక్త మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

టీడీపీ ప్రచారంలో వలంటీర్ వైసీపీ నినాదాలు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 16 : టీడీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నంద్యాల వరదరాజులరెడ్డి తాళ్ళమాపురం పంచాయతీ మూలవారిపల్లె లో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మూలవారిపల్లెకు చెందిన మార్కు అనే వలంటీర్ వైసీపీ అనుకూల నినాదాలు ఇచ్చారు. దీనిపై టీడీపీ నేతలు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు ఈ సంఘటనపై విచారణ చేసి మార్కును విధుల నుంచి తొలగించడంతోపాటు అతనిపై కేసునమోదు చేసినటు రూరల్ ఎంసీసీ అధికారి ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామాంజనేయరెడ్డి తెలిపారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేయాలి



కళాశాల ఎదుట యాజమాన్యంతో వాగ్వాదం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

రాజంపేటటౌన్, ఏప్రిల్ 16: బీటెక్ విద్యార్థిని రేణుక మృతిపై వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం టీఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, పీడీఎస్‌యూ, జీఆర్ఎస్ఎఫ్ఐ సంఘాలు కళాశాల వద్ద ఆందోళన చేశాయి. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర మాట్లాడుతూ ఈ కళాశాలలో ఏడాది వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. విద్యాలయంలో ఏ జరుగుతుందో నిజానిజాలు వెలుగులోకి రావాలంటే రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు. విద్యార్థుల మరణాలకు కారణాలేమిటో వెలికి తీయాలన్నారు. విద్యార్థిని చనిపోయే ముందు సూసైడ్ నోట్ రాసిందని పుకార్లు వస్తున్నాయని, వెనువెంటనే ఆ సూసైడ్ నోట్‌ను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పల్లవి

సంబేపల్లె, ఏప్రిల్ 16: జాతీయ స్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలకు సంబేపల్లె మోడల్ స్కూల్ క్రీడాకారిణి ఎం.పల్లవి ఎంపికైనట్లు మంగళవారం ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. మార్చి 30న తిరుపతిలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ పోటీలు నిర్వహించారు. అండర్ -19 విభాగంలో విశేష ప్రతిభ కనపర్చడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని అమరావతిలో 67వ జాతీయ పాఠశాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషాను పల్లవిని ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సీఏల సంస్థ కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాసులురెడ్డి



కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16 : అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ దక్షిణ భారత విభాగం దివాలా,వాల్యుయేషన్ స్టాండర్స్ కమిటీ కార్యవర్గ సభ్యుడిగా ప్రముఖ ప్రాక్టీసింగ్ చార్టర్డ్ అకౌంటెంట్ మల్లం శ్రీనివాసులరెడ్డి ఎంపికయ్యారు. ఈయన కడప జిల్లా పెండ్లిమర్రి మండలం, మొయిళ్లకాల్వ గ్రామ వాస్తవ్యుడు మల్లం పుల్లారెడ్డి, మల్లం వెంకటలక్షుమ్మ కుమారుడు. ఆయన విద్యాభ్యాసం కడపలో, హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సాగింది. ఇప్పుడు కడపలో వైవీయూలో పీహెచ్‌డీచేస్తున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా మొక్కవోని పట్టుదలతో క్రమశిక్షణతో సీఏ పట్టా సాధించిన ఆయన ఇప్పుడు ప్రతిష్టాత్మకమైన కమిటీలో స్థానం సాధించారు. ఈ అర్హత సాధించిన శ్రీనివాసులరెడ్డిని మిత్రులు, బంధువులు మరియు ప్రముఖులు అభినందించారు.

యువకుడిపై కత్తులతో దాడి

పోలీసు అదుపులో నిందితులు

కడపక్రైం ఏప్రిల్16: కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన యువకుడిపై సోమవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కొందరు కత్తులతో దాడి చేశారు. రాజారెడ్డివీధికి చెందిన సుజిత్, అభినయ్ అన్నదమ్ములు. వారికి మృత్యుంజయకుంటకు చెందిన యువకుడితో మనస్పర్థలు ఉన్నాయి. సోమవారం రాత్రి మృత్యుంజయకుంటకు చెందిన యువకుడు అదే ప్రాంతానికి చెందిన ఓ రౌడీషీటర్, మరి కొందరితో కలిసి సుజిత్ బైకుకు నిప్పంటించి పారిపోయారు. దీంతో సుజిత్ తన సోదరుడు అభినయ్‌తో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళుతుండగా రౌడీషీటర్ ఫోన్ చేసి ఆర్‌టీసీ బస్టాండ్ వద్దకు పిలింపించాడు. అభినయ్ అక్కడికి వెళ్లగానే కత్తులతో దాడి చేశారు. అదే ప్రాంతాంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై మధుసూదన్ రెడ్డి అక్కడికి చేరుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు పరారయ్యారు. గాయపడ్డ యువకుడిని రిమ్స్‌కు తరలించారు. భాదితుడి ఫిర్యాదు మేరకు నిందితులపె కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

నామినేషన్ల ప్రక్రియను విజయవంతం చేయాలి

● కలెక్టర్, జిల్లా ఎన్నిక అధికారి అభిషిక్త్‌కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 16: జిల్లాలో ఈ నెల 18 నుంచి మొదలయ్యే నామినేషన్స్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. నామినేషన్ ప్రారంభం నుంచి రాబోయే రోజుల్లో వివిధ అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలు, నిర్వర్తించాల్సిన విధులపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్, స్థానిక అధికారులతో మాట్లాడుతూ సీ విజిల్ ఈఎస్ఎంఎస్ డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీ ద్వారా సీజర్స్, రిజీజెస్ అంశాల్లో ప్రగతిపై ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించాలన్నారు. నామినేషన్స్ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని, అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు నిర్దేశిత నమూనాలో నివేదికలను సమర్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్‌లపై రోజువారి నివేది సమర్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ టీమ్స్, మైక్రో అబ్జర్వర్ల నియామకం, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ టీమ్స్ రిజిస్టర్ మెయింటెనెన్స్ తదితర అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణరావు, వివిధ విభాగాల నోడల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరగాలి

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ప్రారంభం అవుతుందని ఎలాంటి ఆర్భాటాలు హంగులు ప్రదర్శించకుండా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌బాను తెలిపారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యి 25న ముగుస్తుందన్నారు. 26న నామినేషన్ల స్క్రూటినీ ఉంటుందన్నారు. 29 న ఉపసంహరణ. అదే రోజు గుర్తుల కేటాయింపు జరుగుతుందన్నారు. మే 13న పోలింగ్ జరుగుతుందన్నారు. నామినేషన్లుకు ఏమేం జతచేయాలో పార్టీ ప్రతినిధులకు వివరించారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు విద్యాసాగర్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంపీడీవో రామాంజనేయరెడ్డి, రాజుపాళెం ఎంపీడీవో వెంకటరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు అజయ్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై అలసత్వం వహిస్తే చర్యలు : ఎస్ఈ



విద్యుత్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్ఈ రమణ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 16 : నిర్దేశిత పోలింగ్‌బూత్‌ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లకు మరమ్మతులు చేసి అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ అన్నారు. మంగళవారం ఆయన పోరుమామిళ్లలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు క్షేత్రస్థాయిలో ఆయనే స్వయంగా తిరిగి పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పోరుమామిళ్ల సబ్ డివిజను పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల క్షేత్ర స్థాయి అధికారులు సిబ్బందితో పోరుమామిళలోని సీసీఆర్ కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి ఎద్దడి కారణంగా నీటి పథకాల కొత్త పనులు, మరమ్మతులను అత్యధిక ప్రాధాన్యతతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కరెంటు పోయి ప్రజలు భరించలేని స్థితిలో ఉన్నప్పుడు విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని, లో ఓల్టేజీ సమస్య అధిగమించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా చేయాలనే తలంపుతో సిబ్బంది పనిచేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను ఉద్యోగులు తన సొంత ఆస్తిగా భావించాలన్నారు. మీటర్లను ఇంటిలోపల కాకుండా బయట బిగించాలన్నారు. వీధిలైట్లు పగటిపూట వెలుగుతున్నాయని, సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఒక్క యూనిట్ కూడా విద్యుత్ వృథా కాకూడదన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ పడవద్దని విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్ చౌర్యం అరికట్టాలని, వాలిపోయిన స్తంభాలు, వేలాడుతున్న తీగెలను సరిచేయాలన్నారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రతా నియమాలు పాటించాలన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో రైతులు తామే ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు మార్చడం వటి పనులపై స్పందించాలన్నారు. విద్యుత్ వినియోగదారుడికి సమస్యలు వచ్చినప్పుడు సిబ్బంది వెంటనే పరిష్కరించాలన్నరు. కడప సీనియర్ అకౌంట్స్ ఆఫీసరు మధు, అకౌంటు ఆఫీసరు మల్లికార్జున, మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాయక్, ఏఏవో శివకుమార్, పోరుమామిళ్ల ఏఈ వెంకట మహేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై వైవీయూ తీవ్ర దిగ్భ్రాంతి



విద్యార్థులకు ధైర్యం చెబుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16 : వైవీయూ బయోటెక్నాలజీ విద్యార్థిని సుల్తానా మృతి పట్ల తోటి విద్యార్థులు అధ్యాపకులు అధికారులు తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు తరగతి గదిలో తోటి విద్యార్థులతో కలిసి పాఠాలు విన్న సుల్తానా అంతలోనే హాస్టలు వసతిగృహంలో బలన్మరణానికి పాల్పడిందని తెలియడం కలచివేసింది. విషయం తెలియగానే వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, సీఈ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి, హెల్త్ సెంటరు వైద్యులు నరేష్‌కుమార్‌రెడ్డి విద్యార్థినిని రిమ్స్‌కు తరలించారు. ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. హాస్టలులో తరగతి గదిలో అధ్యాపకులతో మాట్లాడారు. గత వారంలో పండుగ సెలవులు ఉండడంతో సుల్తానా తన సొంత ఊరు అయిన కదిరికి వెళ్లి సోమవారం యథావిధిగా తరగతులకు హాజరైనట్లు తోటి విద్యార్థులు తెలిపారు. తరగతిలో కూడా యాక్టివ్‌గా ఉన్నట్లు తెలిపారు. కాన్ఫరెన్స్ కోసం హైదరాబాదు వెళ్లిన వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ విద్యార్థిని మృతిపై ఆరా తీశారు.

వీరశివారెడ్డి చంద్రబాబును విమర్శించడం విడ్డూరం

● టీడీపీ నేత హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరి ప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16 : పూటకో పార్టీ మార్చే మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డికి చంద్రబాబు, పుత్తా నరసింహారెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, కమలాపురం నాయకులు గంధం మోహన్, టక్కోలి కృష్ణారెడ్డి విమర్శించారు. శనివారం కడప నగరం హరి టవర్స్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు టికెట్లు అమ్ముకున్నాడని ఆరోపించిన వీరశివారెడ్డి, తాను టీడీపీలో ఉన్నప్పుడు ఎన్ని కోట్లు పెట్టి టికెట్లు కొన్నాడో చెప్పాలన్నారు. ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, పుత్తా నరసింహారెడ్డి గెలిచినా ఓడినా ఒకే పార్టీలో ఉన్నాడని, నీలా పార్టీ మారలేదని, నీచ రాజకీయాలు చేయలేదని అన్నారు. పార్టీలో ఉండి కూడా పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసిన చరిత్ర వీరశివాదన్నారు. తనకు టికెట్ ఇస్తే మంచివాళ్లు, లేకపోతే అమ్ముకునేవాళ్లని అనడం ఆయన నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. వీటిని నమ్మే పరిస్థితుల్లో కమలాపురం నియోజకవర్గ ప్రజలులేరన్నారు. కార్యక్రమంలో గన్నేపాటి మల్లేశ్, గంధం ప్రసాద్; కృష్ణారెడ్డి, గంధం మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల అంచనాకే శ్లాష్ పరీక్ష : డీఈవో



కడప: పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఈవో అనూరాధ



రాజంపేట: పరీక్షలను తనిఖీ చేస్తున్న డీఈవో శివప్రకాష్ రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 16 : విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకే శ్లాష్ పరీక్ష నిర్వహించామని డీఈవో ఎం.అనురాధ తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 121 ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల లో నాలుగవ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడంపై సామర్థ్యాలను అంచనా వేయడానికి స్లాష్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామర్థ్య పరీక్షలు నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖలో సీఆర్పీల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య, సమగ్ర శిక్ష ఏఎంవో ధనలక్ష్మి, ఎంఈవో పాలెం నారాయణ, అహ్మద్ పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: మండలంలోని దిగువబసినాయుడుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో స్లాస్ పరీక్షా కేంద్రాన్ని మంగళవారం డీఈవో శివప్రకాష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఎంఈవో రఘునాథ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని జగనన్న గోరుముద్ద నాణ్యతను పరిశీలించారు.

ఇరు వర్గాల ఘర్షణ.. పలువురికి గాయాలు







గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 16: పట్టణంలో క్షమాపణ కోసం అంబకపల్లె రోడ్డు జ్యోతి హాస్పిటల్ వద్ద ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో పెద్దజూటూరుకు చెందిన వేణు, వంశి, పాండు కృష్ణారెడ్డి, జస్వంత్ పట్టణంలోని ఎరగుడిపాలెంకు చెందిన మల్లికార్జున, చందు, పండు, నాగిరెడ్డి, మరి కొంతమంది యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడప రోడ్డులోని ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం వేణు తదితరులు నడుపుతున్న కారు ఎర్రగుడిపాలేనికి చెందిన మల్లికార్జున బైక్‌ను ఢీకొంది. అయితే, వారు కారు ఆపకుండా వెళ్లడంతో మల్లికార్జున కారును వెంబడించి అంబకపల్లె రోడ్డులోని జ్యోతి ఆసుపత్రి సమీపంలో అడుకున్నాడు. కారులోని వారితో వాగ్వాదానికి దిగాడు. ఇరువురూ తమ మిత్రులకు ఫోన్ చేసుకోవడంతో అక్కడికి చేరుకుని కట్టెలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. సర్ది చెప్పేందుకు ప్రయత్నించిన వారిపై కూడా దాడికి యత్నించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయాలైన వారిని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిముంజెలకు భలే గిరాకీ..



పులివెందుల టౌన్, ఏప్రిల్ 16: వేసవి వచ్చిందంటే తాటిముంజెలకు గిరాకీ ఉంటుంది. ఔషధ గుణాలతో పాటు వేసవి తాపం నుంచి ఉపశమనం అందిస్తాయన్న ఉద్దేశంలో పలువురు వీటిని కొనుగోలు చేస్తారు. ఎర్రిపల్లె, అచ్చవెల్లి, గోటూరు తదితర గ్రామాల నుంచి రోజు తాటిముంజెలను తీసుకొచ్చి పట్టణంలోని పార్నపల్లె బస్టాండ్, పూలంగళ్ల సర్కిల్, కడప రోడ్డు ప్రాంతాలలో డజను రూ.100కు విక్రయిస్తున్నారు. దీంతో రోజుకు రూ.5వేల వరకు ఆదాయం వస్తుందని, మున్సిపాలిటీ పన్ను కూడా చెల్లిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. వేసవి కావడంతో వ్యాపారం బాగుందని చెబుతున్నారు.

నవ వధువు ఆత్మహత్య



ఝాన్సీ మృతదేహం

గాలివీడు, ఏప్రిల్ 16: మండలంలోని పూలుకుంట పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన నవవధువు ఝాన్సీ (19) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. గత 15 రోజుల క్రితం రెడ్డివారిపల్లెకు చెందిన వ్యక్తితో ఝాన్సీకి వివాహం కాగా, రెండు రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోందని, ఆ బాధ భరించలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుందని అమ్మాయి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

చెన్నూరు, ఏప్రిల్ 16 :మండలంలోని రుద్రభారతిపేటలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలోమృతి చెందాడు. ఎయిర్‌పోర్టు సమీపంలోని ఇండియన్ పెట్రోలు బంకు పక్కన ఉన్న గాలిమిషన్ వద్ద 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువకుడు మృతి చెందినట్లు స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం రావడంతో పోలీసు సిబ్బంది పరిశీలించారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడం గుర్తించారు. మృతదేహంపై నలుపు ఆకుపచ్చ రంగు చొక్కా, బ్లాక్ జీన్స్ ప్యాంటు ఉంది. మద్యం మత్తులో అక్కడ తూలుతూ తిరిగేవాడని, స్థానికులు పోలీసులకు వివరించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఏనుగుల దాడిలో అరటి తోట ధ్వంసం



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు(రూరల్), ఏప్రిల్ 16: మండలంలోని వీపీఆర్ కండ్రిక పంచాయతీలోని దేశెటిపల్లె బీటు పరిధిలో ఉన్న కమలానగర్ గ్రామానికి చెందిన రైతు కృష్ణకు చెందిన నాలుగు ఎకరాల అరటి తోటపై సోమవారం అర్ధరాత్రి ఏనుగుల మంద దాడి చేసింది. తోటలో ఉన్న మోటర్లను పైపులను ధ్వంసం చేశాయి. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు తోటను పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు తెలిపారు. చేతికొచ్చిన పంట నాశనం కావడంతో రైతు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్ట పరిహారం త్వరగా ఇప్పించాలని అధికారులను కోరారు. వేసని వచ్చిందంటే అటవీ పరిసర ప్రాంతాల్లో ఉన్న పంట పొలాల కు ఏను గుల బెడద తప్పడం లేదు. ఏనుగుల దాడి నుండి పంట పొలాలను కాపాడాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

గువ్వలచెరువు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం



బొగ్గులారీని బయటకు తీస్తున్న క్రేన్

సికెదిన్నె, ఏప్రిల్ 16: కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లో మంగళవారం బ్రేక్ ఫెయిల్ కావడంతో బొగ్గు లారీ మరో వాహనాన్ని ఢీ కొందని సీకే దిన్నె సీఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. రాయచోటి నుంచి కడపకు బొగ్గులోడుతో వస్తున్న లారీ బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి కారుపై పడింది. దీంతో క్యాబిన్‌లో చిక్కుకు పోయిన కారు డ్రైవర్‌ను అగ్నిమాపక సిబ్బంది సహకారంతో రెండు క్రేన్లు, ఎక్స్‌కవేటర్, హైడ్రాలిక్ కట్టర్ల సాయంతో రక్షించి ఆస్పత్రికి తరలించామన్నారు. కార్యక్రమంలో సికెదిన్నె పోలీసులు, అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి, సంజీవరాజు, సతీష్, మోహన్, జలీల్, కరిముల్లా, మురళీకృష్ణ, పవన్‌కుమార్, రమేష్‌నాయక్, శివశంకర్, శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16: రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామంలో సోమవారం రాత్రి పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న రాయచోటి అర్బన్ పోలీసులు మెరుపుదాడి చేసి 8 మందిని అరెస్టు చేయడంతో పాటు, రూ.27 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. రాయచోటి అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి పోలీసు సిబ్బంది మాధవరం కస్పాకు సమీపంలో ముళ్లపొదల్లో జూదం ఆడుతున్న 18 మందిని అరెస్టు చేశారు. మరో 10 మంది పరారైనట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో హేమంత్ అనే వలంటీర్ ఉన్నట్లు తెలిపారు. జూదరుల నుంచి 52 పేక ముక్కలతో పాటు రూ.27 వేలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలియజేశారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మహిళల అభ్యున్నతే లక్ష్యంగా 'మహాశక్తి'

- అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధికి దోహదపడేవి సూపర్ సిక్స్ పథకాలు
- అనుభవం, ముందుచూపుగల నేత చంద్రబాబు
- టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 16 :టీడీపీ అధినేత చంద్రబాబు రూపొందించిన మహాశక్తి పథకం మహిళల అభ్యున్నతే లక్ష్యంగా అమలు చేయడం జరుగుతుందని టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం 45వ డివిజను మాజీ కార్పోరేటరు సరస్వతమ్మ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ నగర్ ఎంపీపీ స్కూలు నుండి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తారని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు కుటుంబంలో చదువుతుంటే వారందరకీ ఒక్కొక్కరికి రూ. 15వేలు అందిస్తారన్నారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని తెలిపారు. అలాగే ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ టికెట్టు లేని ప్రయాణ సౌకర్యం కల్పిస్తారన్నారు.







ఎన్నికల ప్రచారంలో భాగంగా వృద్ధురాలితో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి... ప్రజలకు అభివాదం చేస్తున్న మాధవీరెడ్డి... టీడీపీ పథకాలను వివరిస్తున్న దృశ్యం

చంద్రబాబుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యం

వైసీపీ పాలనలో రాష్ట్రం రివర్స్‌లో కొనసాగుతుందని చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపొందుతుందని తెలిపారు. చంద్రబాబునాయుడు తన కుతాను డ్రైవరుగా అభివర్ణించి ప్రజలను రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించే బాధ్యత తీసుకుంటారని చెప్పారు. అనుభవం, బాధ్యత ఉన్న నేతగా మన కోసం చంద్రబాబునాయుడు చేసే పోరాటంలో మనం అండగా ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. జగన్ అసమర్థ అవినీతి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందని చెప్పారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి పథంతో దూసుకుపోతుంటే మన రాష్ట్రం వెనుకబడిపోయిందన్నారు. జగన్‌రెడ్డి రివర్స్ పాలనతో ప్రజలు జీవితాలు కూడా రివర్స్ అయ్యాయన్నారు. ప్రజలను సంక్షేమాభివృద్ధి వైపు తీసుకువెళ్లే బాధ్యత చంద్రబాబు తీసుకుంటారని చెప్పారు. యువతకు భవితకు బాబు హామీ ఇస్తున్నారన్నారు. యువత చంద్రబాబుతో కలిసి రావాలని భవిష్యత్తు ప్రయాణాన్ని టీడీపీ చూసుకుంటుందన్నారు. మన సులభమైన సౌకర్యవంతమైన ప్రయాణానికి చంద్రబాబే డ్రైవరు అని తెలిపారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమే కాదు.. మీ జీవిత ప్రయాణంలోనూ మీ చంద్రన్న మీకు డ్రైవరుగా ఉంటారన్నారు. మిమ్మల్ని భద్రంగా, క్షేమంగా సాధికారత వైపు శరవేగంగా తీసుకుపోయే బాధ్యత చంద్రబాబుదే అని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు ప్రయాణానికి అనుభవం ఉన్న డ్రైవరుగా మారి అభివృద్ధి వైపు ప్రజలను తీసుకెళతానన్న చంద్రబాబు హామీ తప్పక నెరవేరుస్తారన్నారు.

శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్...

నాడు బాబాయి హత్య నేడు అవ్వ తాతలను చంపి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శవ రాజీకయాలు చేస్తున్నారని ఆరోపించారు. శవం ఎక్కడ ఎప్పుడు దొరుకుతుందా, రాజకీయం చేద్దామా అనేలా జగన్ తయారయ్యాడన్నారు. జోగి రమేష్ చేత చనిపోయిన వృద్ధురాలితో రాజకీయం చేయాలని జగన్ ప్రయత్నించిన విషయం గుర్తు చేశారు. బాధిత కుటుంబం చీవాట్లు పెట్టి తరిమికొట్టిందన్నారు. బాధల్లో ఉన్న వారిని ఓదార్చడం మాని వారితో కూడా శవ రాజకీయాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. పింఛన్ల కోసంసచివాలయాలకు వచ్చిన వారిని తరువాత రావాలంటూ ఇళ్లకు పంపించడం మహా దారుణమన్నారు. మధ్యాహ్నం వరకు పింఛన్లు ఇవ్వలేదని ఖజానాలో నిధులు లేకనే పింఛన్లను జగన్‌రెడ్డి ప్రభుత్వం పంపిణబీూ చేయలేకపోయిందన్నారు. ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీకి కలెక్టర్లు సరే అన్నా దాన్ని వ్యతిరేకిస్తున్న సెర్ప్ సీఈవో ప్రవర్తన దుర్మార్గమన్నారు. పింఛను సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు మార్చి 16 నుంచి 30వ తేదీ మధ్య 15 రోజుల్లోనే ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్‌రెడ్డి దోచిపెట్టాడని ఆరోపించారు. సచివాలయ సిబ్బంది గ్రామ కార్యదర్శులతో ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేయకపోవడానికి నిధుల కొరతే కారణం కానీ ఎన్నికల కమిషన్ టీడీపీ కాదన్నారు. వివేకానందరెడ్డి హత్యను చంద్రబాబుకు అంటగట్టి రాజకీయం చేశారన్నారు. నేడు పింఛన్ల పంపిణీ ఆలస్యం చేసి దాన్ని కూడా టీడీపీకి అంటగట్టాలని దుష్ప్రచారం చేశారని విమర్శించారు. అయితే ఈ కుట్రను ప్రజలు తిప్పి కొట్టారని చెప్పారు. చంద్రబాబు సీఎం కాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4వేలు పింఛను అందిస్తారన్నారు. గతంలో రూ.200 ఉన్న పింఛను రూ. 1800కు పెంచి ఆ తరువాత రూ.2వేలకు పెంచింది. చంద్రబాబు అన్నారు. పింఛన్లు సకాలంలో ఇంటి వద్దనే పంపిణీ చేయకపోతే సీఎం జగన్‌రెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డిపై ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1వ తేదీనే ప్రతి నెలా పెన్షనర్లకు ఇవ్వాల్సిన డబ్బును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వలంటీర్లను ప్రజాసేవకు కాకుండా వైసీపీ కార్యక్రమాలకు వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారన్నారు. వలంటీర్లు ఎన్నికల కోడ్ ఉల్లంగించే విధంగా చేసి వందల మందిపై క్రిమినల్ కేసుల నమోదుకు జగన్‌రెడ్డి కారణమయ్యాడని, ఇప్పుడు కొత్తగా వలంటీర్లను రాజీనామా చేయిస్తూ వారిపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి వలంటీర్లను ప్రజా సేవకులుగా కాకుండా తన సొంత పార్టీ కార్యకర్తల్లా దుర్వినియోగపరిచేందుకు చూస్తున్నారని తెలిపారు. జగన్‌రెడ్డి రూ.2వేలు ఉన్న పింఛన్‌ను విడతల వారీగా ఎన్నికల ముందు వరకు పెంచింది కేవలం రూ.750 మాత్రమే. నిత్యావసర ధరలు భారీగా పెంచి పన్నులు మోది ధరల వాత పెట్టి ఐదళ్లలో పెంచింది .వెయ్యి మాత్రమేనన్నారు. విడదల వారీగా పెంపు దగాతో ఒక్కో పింఛనుదారుడికి జగన్‌రెడ్డి రూ.31500 ఎగనామం పెట్టాడని ఆరోపించారు. వైసీపీ కార్యక్రమాల్లో పాల్గను కుండా ప్రజా సేవ మాత్రమే చేసే వలంటీర్లను రాబోవు టీడీపీ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం పింఛనుదారులకు నెలకు రూ.4వేలు చొప్పున ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తుందన్నారు.

అందుకే ప్రజలందరూ ఏకమై కలిసికట్టుగా సైకిల్ గుర్తుపై ఓటేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అత్యధిక మెజార్టీగో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ, నాయకులు నారాయణ, రాంప్రసాద్‌రెడ్డి, అనిల్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

మద్యం మాఫియాతో లక్షల కోట్లు కొట్టేశారు: మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 16: వైసీపీ హయాంలో మద్యం మాఫియాతో లక్షల కోట్లు కొట్టేశారని కడప టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కడప నగరం 45వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలు అందించి సంక్షేమ పథకాల గురించి వివరించారు. పేదవారికి ఆకలి తీర్చేందుకు కిలో రూ.2కే బియ్యం తీసుకువచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. వృద్ధులకు ఆసరాగా ఉండాలనే ఉద్దేశ్యంతో వృద్ధాప్య పింఛన్లు ప్రారంభించి పండుటాకుల జీవితాల్లో వెలుగు నింపిన నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. సాగునీటి కోసం ప్రాజెక్టులను ప్రారంభించారన్నారు. ప్రతి పేదవాడికి కూడు, గూడు అనే నినాదంతో పేద కుటుంబాల్లో వెలుగును నింపారన్నారు. ఎన్టీఆర్ వారసత్వంగా టీడీపీని నడిపిస్తున్న చంద్రబాబు నాయుడు ఆయన ఆశయాలను నెరవేర్చగలరన్నారు. అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడిపించే సత్తా చంద్రబాబుకు ఉందని తెలిపారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో మద్యపాన నిషేధం పేరుతో జగన్‌రెడ్డి కోట్ల రూపాయలు



తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న ఆ పార్టీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

లూటీ చేస్తున్నారని ఆరోపించారు. మద్యపాన నిషేధం అని చెప్పి న జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం మద్యం అమ్మేలా చర్యలు చేపట్టారన్నారు. మద్యపాన నిషేధంపై హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి నేటికీ ఒక్క డి-అడిక్షన్ సెంటర్ కూడా ప్రారంభించలేదని చెప్పారు. ఐదు ఏళ్లలో మద్యం సేవించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందేకానీ తగ్గిన దాఖలాలు లేవన్నారు. మద్యం మాఫియా ద్వారా జె గ్యాంగ్ లక్షల కోట్లను అప్పనంగా కొట్టేస్తున్నార న్నారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం బ్లాక్ మార్కెట్‌లో విచ్చలవిడిగా సరఫరా అవుతోందని చెప్పారు.

జగన్‌రెడ్డి సోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి మద్యం వ్యాపారంలో ఆరితేరారన్నారు. ఆయన రాష్ట్రంలో మద్యం తయారీ కంపెనీలను నియంత్రిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో అక్రమంగా వైసీపీ అభ్య ర్థులకు మద్యం సరఫరాకు ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి ప్రణాళికలను రూపొందించారని తెలిపారు. మద్యం మీద వచ్చే ఆదా యాన్ని కూడా జగన్‌రెడ్డి మరో ఇరవై ఏళ్ల వరకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. అంటే వచ్చే ఇరవై ఏళ్ల వరకు మద్యపాన నిషేధం అమలు కాకుండా చేసిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి జగన్ ట్రబుల్ ఇంజన్ సర్కారు పోయి ఎన్‌డీఏ కూటమి డబుల్ ఇంజన్ సర్కారు రావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న మాధవీరెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి

టీడీపీలోకి 100 కుటుంబాలు చేరిక

సీకేదిన్నె, ఏప్రిల్ 16: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రానికి పసిడి భవిత సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చింతకొమ్మదిన్నెలో టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డితో కలిసి బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి 100 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో గంగమ్మగుడి మాజీ చైర్మన్ జయకుమార్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ మల్లికార్జున, చేపల సంఘం చైర్మన్ గంగులు, టి.బాష, పూల రవి, వెంకటస్వామి, అల్లాబకాష్, శాంతయ్య, లక్ష్మీదేవి, మనోహర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితర కుటుంబాలవారు ఉన్నారు. టీడీపీ నాయకులు పుత్తా అల్లుడు యశ్వంత్‌రెడ్డి, డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి,మోహన్‌బాబు, పాలగిరి పీరూప్రసాద్, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నజీర్, రాజారావు, శంకర్‌రెడ్డి, దస్తగిరి, మహేశ్వర్‌రెడ్డి, మహేశ్వరి, రమణయ్య, గోవిందు, మాధవరెడ్డి, కొండయ్య, వెంకటరమణ, సుబాన్, ధర్మారెడ్డి, బాబు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో పుత్తా

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



విజయదుర్గా ఆలయంలో పూజలుచేస్తున్న భక్తులు(ఇన్‌సెట్) అమ్మవారు

కడప (కల్చరల్), ఏప్రిల్ 16 : నగరంలోని బిల్టప్ సమీపంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 3గంటల నుంచి 4.30 వరకు ఎండను సైతం లెక్కచేయకుండా మహిళలు అత్యంత భక్తితోపూజలు చేశారు. కాగా శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం జరగనున్నదని ఆలయ వ్యవస్థాపకుడు మల్లిఖార్జునరావు తెలిపారు.

ఆదరించండి.. అభివృద్ధికి సహకరిస్తా

చెన్నూరు, ఏప్రిల్ 16:టీడీపీని ఆదరించి గెలిపిస్తే అభివృద్ధికి సహకరిస్తానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి పుత్తా సరళమ్మ అన్నారు. మండలంలోని కొండపేట గ్రామంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, బాషు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి, యువనేతలు ఓబుల కొండయ్య, జింకా రమేష్, పసుపులేటి శ్యాంసుందర్, బాలకృష్ణ, జింకా సుబ్బరాయుడు, ఖాసింపీరా, మాబు, రవిశంకర్ పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు'

వల్లూరు, ఏప్రిల్ 16 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడితోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సోదరుడు (జ్యోతిరెడ్డి) కుమారుడు సాయినరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోట్లూరు గ్రామంలో టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినరసింహారెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ వస్తే అమలుచేసే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, హరిక్రిష్ణయాదవ్, నాగసుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మీరెడ్డి, భాస్కర్, వెంకటసుబ్బారెడ్డి, నాగిరెడ్డి, మదన్‌మోహన్, ఓబులరెడ్డి, రమణారెడ్డి, సుదర్శనరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లింగాల మండలంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

పులివెందుల టౌన్,ఏప్రిల్ 16: లింగాల మండలంలో మంగళవారం 20 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. మురారిచింతల గ్రామానికి చెందిన పిట్టు రాఘవరెడ్డి, సరిబాల చిన్నపురెడ్డి, సరిబాల చలమారెడ్డి, శ్రీనివాస్, సదాశివుడు, రవికుమార్, రమణ, అనిల్‌కుమార్, బాలగంగయ్య, కేతిరెడ్డి రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డితో పాటు పలు కుటుంబాలవారు బీటెక్ రవి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

పులివెందులకు చేరిన లోక్‌సభ అభ్యర్థుల ఈవీఎంలు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 16: పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి లోక్‌సభ అభ్యర్థుల ఈవీఎంలు సోమవారం రాత్రి పులివెందుల పట్టణానికి చేరాయి. పులివెందుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశులు ఆధ్వర్యంలో పట్టణంలోని జేఎన్టీయూ కళాశాలలో ఈవీఎంలను భద్రపరచారు. రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల సమక్షంలో ఎన్నికల అధికారి వెంకటేశులు వీటిని స్ట్రాంగ్ రూములో సీల్ వేశారు. తహసీల్దార్ రమేష్‌బాబు, ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'మంచినీటి సరఫరాలో కార్పొరేషన్ విఫలం'

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16 : కడప కార్పొరేషన్ పరిధిలో మంచినీఇ సరఫరా చేయడంలో కార్పొరేషన్ విఫలమైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి తెలిపారు. శనివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప కార్పొరేషన్ ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీస్థలాల పన్ను వసూలు చేస్తున్నారని, అయితే నీటి సంగతి ఏమిటని ప్రశ్నించారు.

ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి: ఎస్ఐ

వల్లూరు, ఏప్రిల్ 16 : వచ్చే ఎన్నికల్లో భాగంగా ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. మంగళవారం కేంద్ర బలగాలతో మండల పరిధిలోని పెద్దపుత్త, తప్పెట్ల, లేబాక తదితర గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు.

నేడు సీతారాముల కల్యాణ మహోత్సవం



కడప (కల్చరల్), ఏప్రిల్ 16 : శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా నగర చెమ్ముమియ్యాపేటలో వెలసిన అభయ సీతారాముల స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరగనున్నట్లు ఆలయ ధర్మకర్తలు సరస్వతమ్మ, పి.సుబ్బరామాచార్యులు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు చేపట్టనున్న కల్యాణ మహోత్సవానికి భక్తులు హాజరు కావాలని కోరారు. మధ్యాహ్నం 1కి అన్నదానం ఉంటుందన్నారు. రాత్రి 7గటలకు స్వామివారి గ్రామోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.

గవర్నమెంటు ప్రొటోకాల్‌తో కమలాపురం ఉరుసు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 16 : రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునిచ్చి ప్రోటోకాల్ ప్రకారం కమలాపురంలో వెలసిన దర్గా ఏ గఫారియా ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి సోదరుడు ఇస్మాయిల్, కడప ముస్లిం మైనార్టీ అధికారి ఇబ్రహీం తెలిపారు. మంగళవారం స్థానిక దర్గా ఆవరణంలో బుక్‌లెట్‌ను ప్రారంభించారు.

నామినేషన్ల స్వీకరణకు పక్కా ఏర్పాట్లు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశులు

పులివెందుల టౌన్,ఏప్రిల్ 16: పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి స్థానిక మినిసెక్రటేరియట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎన్నికల్ రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు యంత్రాంగం సిద్ధమైంది. ఈ సందర్భంగా ఆర్‌ఓ వెంకటేశులు మంగళవారం ఎన్నికల సిబ్బందికి, పోలీస్ శాఖకు అవగాహన కల్పించారు. అలాగే కార్యాలయ ప్రాంగణంలో నామినేషన్ల సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

నామినేషన్లు దా ఖలు చేసే సమయంలో అభ్యర్థుల సందేహాల ని వృత్తి చేయనున్నారు. నామినేషన్ల కేంద్రం నుంచి వంద మీటర్ల వరకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారని, అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే సమయంలో మీడియాను అనుమతించమన్నారు. ఉద యం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని ఆయన వివరించారు.

అభ్యర్థితో పాటు నలుగురికి అనుమతి

అభ్యర్థులు నామినేషన్లు వేసేటపుడు ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని వెంకటేశులు సిబ్బందికి ఆదేశించారు. సెలవు రోజులు మినహాయించి ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, నామినేషన్ కేంద్రం వద్ద వందమీటర్ల దూరం వరకు మూడు వాహనాలకే అనుమతి ఉందన్నారు. శాసన సభకు పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.40లక్షలు అని పేర్కొన్నారు. అభ్యర్థుల ఖర్చు వివరాలు తెలిపేందుకు మూడు రిజిస్టర్లు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు రూ.10వేలు దరావత్తు కింద చెల్లించాలని, అదే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు చెల్లించాలన్నారు. నామినేషన్ చేసిన చివరి రోజున నిర్ణీత సమయంలో పార్టీలు చేసిన బి-ఫాంలు అందించాలన్నారు. 26వ తేదీ నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు అవకాశం కల్పించామని తెలిపారు. అదేరోజు పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తామన్నారు. మే 12వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్, శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 12న సాయంత్రానికి పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, వీవీప్యాట్‌లు ఇతర సామగ్రిని అందించి ముందుగా అందించిన రూట్‌మ్యాప్ ప్రకారం వాహనాలలు తరలించడం జరుగుతుందన్నారు. 13 న పోలింగ్ జరుగుతుందన్నారు. డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ లు బాలమద్ది లేటి, శంకర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసల వరద




మైలవరంలో టీడీపీలోకి చేర్చుకుంటున్న భూపేశ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి.. మైదుకూరు... వెంకుపల్లె సర్పంచ్ సహా పలువురిని టీడీపీలోకి చేర్చుకుంటున్న పుట్టా సుధాకర్‌యాదవ్

మైలవరం, ఏప్రిల్ 16: మండల పరిధిలోని దొమ్మర నంద్యాల, తొర్రివేముల, సి.కొత్తపల్లి, నక్కవానిపల్లి, బుచ్చంపల్లి, చిన్నకొమెర్ల గ్రామాలకు చెందిన 150 కుటుంబాలు ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంగళవారం సాయంత్రం ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి ఆయా గ్రామాల్లో పర్యటించి గ్రామ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎన్డీయే అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, బూసిరెడ్డి, ఖాదర్, కర్నాటి రామాంజనేయరెడ్డి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: మండలంలోని చిన్నదుద్యాల గ్రామంలో మంగళవారం 40కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి.టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి సమక్షంలో వారు కండువాలు కప్పుకున్నారు.టీడీపీలో చేరిన వారిలో వెంకటేశ్వర్లరెడ్డి,జయరామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శివారెడ్డి, బాలయ్య, రామాంజనేయరెడ్డి, లక్ష్మీదేవి, గంగాదేవి, వరదమ్మ, విజయలక్ష్మి, మరికొందరు ఉన్నారు.రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిల గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మైదుకూరు..: పట్టణంలోని 9వవార్డుకు చెందిన వైసీపీ నాయకులు బండిపెద్ద నరసింహులు, చిన్న నరసింహులు, బసవయ్య, కొండయ్య తదితరులు 40 కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. మంగళవారం ఇంటింటి ప్రచారంకు వచ్చిన టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీ కండువ కప్పుకున్నారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరుగుతూ టీడీపీకి ఓటు వేయాలని, మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దువ్వూరు (మైదుకూరు)..: దువ్వూరు మండలం జొన్నవరం ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు సూర్య నారాయణ రెడ్డి, కోటి, అంకాల్, మహేశ్వరరెడ్డి, లక్షుమయ్య, నాగార్జున, రామక్రిష్ణ, ఊతయ్య దాదాపు 30 కుటుంబాల వారు మంగళవారం ప్రొద్దుటూరులోని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ నివాసానికి చేరుకొని టీడీపీలోకి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బోరెడ్డి రమణరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రాజశేఖర్‌డ్డి,లక్షుమయ్య, నరసింహపాల్గొన్నారు.

వెంకుపల్లె సర్పంచ్ టీడీపీలోకి చేరిక..: దువ్వూరు మండలం వెంకుపల్లె సర్పంచ్ బోధనపు రోజారమణి ఆధ్వర్యంలో దాదాపు 60 కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. ఎన్నికల ప్రచార నిమిత్తం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ గ్రామానికి చేరుకోగా అక్కడ టీడీపీకి మద్దతు ఇస్తున్నామంటూ,నాగభూషణం, నాగరాజు, వెంకటేశ్వర్లు, దాసరి సుబ్బయ్య తదితరులు పార్టీలో చేరారు.

వేసవిలో తాగునీటి సౌకర్యం కల్పిస్తాం

చాపాడు, ఏప్రిల్ 16: వేసవి కాలంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం తాగునీటిపై అత్యవసర సమావేశం ఎంపీపీ లక్షుమయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వం తరుపున మాత్రమే తాగునీటిని ప్రజలకు సరపరా చేస్తామన్నారు. అన్ని గ్రామాల్లో చెడిపోయిన చేతిపంపులు రిపేరు చేసేందుకు ఎంపీడీవో మహబూబ్‌బీ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దారు భూషణం, ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి, ఏవో మ్యాగి, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించండి

మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి



జమ్మలమడుగు, ఏప్రిల్ 16: కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డిని అలాగే ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డిని ఓటర్లు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి వెళ్లి జమ్మలమడుగు రాజీవ్‌నగర్ కాలనీలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అలాగే ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డికి కమలం గుర్తుపై ఓట్లు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివారెడ్డి, బాలూయాదవ్, ఖాదర్, శ్రీనివాసులు, దస్తగిరి, ప్రసాద్, పొన్నతోట శ్రీను, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ నవమి వేడుకలు

మైదుకూరు, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం పట్టణంలోని పలు ఆలయాలల్లో శ్రీసీతా రాముని కల్యాణ వేడుకలు నిర్వహించనున్నారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్, పాతూరు, అమ్మవారుశాల, కోదండ రామాలయం, పార్వతీనగర్‌లోని రామాలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించే ఏర్పాట్లు చేశారు.అలాగేమధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం స్వాముల వారిని గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు.

టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యం

ఖాజీపేట, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుకావడం తథ్యమని టీడీపీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సిద్ధాంతిపురంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి వివరించారు. టీడీపీ గెలుపుకోసం పనిచేయాలని, పుట్టా సుధాకర్‌యాదవ్ గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధిపథంలో తీసుకెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, నాయకులు మురళీమోహన్‌రెడ్డి, వీరయ్య, జలీల్, హబీబ్, సుంకు సత్యం, మహమ్మద్ హర్షద్, రఫి, గౌస్, తోఫిక్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యాస్ రూ.500

పోరుమామిళ్ల, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంట గ్యాస్ రూ.500కే లభిస్తుందని బద్వేలు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్‌డీ విజయజ్యోతి అన్నారు. మంగళవారం పోరుమామిళ్లలోని ఆర్టీసీ బస్టాండు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఎంపీగా షర్మిల, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అన్వర్, సీపీఐ మండల కార్యదర్శి మస్తాన్, సీపీఎం నాయకులు వీరయ్య, కేశవ, బండి జకరయ్య పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు, డీఎస్పీ యశ్వంత్



జమ్మలమడుగు, ఏప్రిల్ 16: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని జమ్మలమడుగు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ యశ్వంత్ హెచ్చరికలు జారీ చేశారు. జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ ఛాంబర్‌లో మంగళవారం జమ్మలమడుగు నియోజకవర్గ పొలిటికల్‌పార్టీల ప్రతినిధులతో నిబంధనలు, నామినేషన్లు తదితరవాటికి సంబంధించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముందుగా రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ పొలిటికల్ పార్టీ నేతలు వారి కార్యకర్తలు ప్రచారానికి సంబంధించి ర్యాలీలు, తదితరవాటి ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. నామినేషన్లు వేసే ప్రధాన పార్టీలవారు మూడుసార్లు పత్రికా ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అనంతరం డీఎస్పీ యశ్వంత్ మాట్లాడుతూ తమకు సమాచారం 48 గంటలకు ముందు ఇవ్వాలన్నారు. ర్యాలీలు ఏదైనా చేసేముందు దరఖాస్తు ముందస్తుగా పెట్టాలన్నారు. ర్యాలీలలో, ప్రచారాలలో క్రాకర్స్ (బాణసంచా) పెట్టరాదన్నారు. అలా నిబంధనలు ఉల్లంఘిస్తే తప్పనిసరిగా కేసులు నమోదు చేస్తామన్నారు. నాయకులు ఉపయోగించే వాహనాలు, నిబంధనల ప్రకారం ఉండాలన్నారు. అలా లేనిచో ఖర్చు పోటీ చేసే అభ్యర్థిపై పడుతున్నారు. ఎన్నికలకు ముందు 18వ తేదీ తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్ల వద్ద మాక్‌పోల్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ పార్టీ నేతల ప్రతినిధులు సీతారాముడు, ధీరజ్‌రెడ్డి, గంగాధర్, పోచిరెడ్డి, శంకర్‌రెడ్డి, పాముల బ్రహ్మానందరెడ్డి, ఎం.సుబ్బారావు, ఆకుల బాబా, వెంకటస్వామి, ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది రమణారెడ్డి, రజియా, మస్తాన్‌వలి, బాష, డిప్యూటీ తహసీల్దారు వేణు, సీఐ కరుణాకర్, ఎస్ఐలు తిమోథి, కల్పన, ఎస్‌బీరవి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించాలి..: జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లు సెక్టార్ అధికారులు తనిఖీలు చేయాలని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మధ్యాహ్నం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో నియోజకవర్గంలోని ఎన్నికల సెక్టార్ ఆఫీసర్లకు పోలింగ్ కేంద్రాల్లో సమస్యలపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారి సెక్టార్ ఆఫీసర్లకు సూచనలు, ఎన్నికల విధి విధానాలు వివరించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేయాలని, అక్కడున్న సమస్యలను పరిష్కరించే దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యం : ఆది



ప్రచారం నిర్వహిస్తున్న ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 16: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యమని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎర్రగుంట్ల 19వ వార్డుల్లోని నడివూరులో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రాజేశ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కత్తిప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ నవీన్, జంగంరెడ్డి, జగదీష్‌రెడ్డి, రఘు, రమేష్‌రెడ్డి, షరీఫ్, రాజారెడ్డి, సత్యం, బాలవెంకటరెడ్డి, భాస్కర్, మాజీ సర్పంచ్ శివారెడ్డి, బియ్యం బాష, సుబ్బరామయ్య, టైలర్‌మాబు పాల్గొన్నారు.

వరద విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న వరదరాజులరెడ్డి

రాజుపాలెం, ఏప్రిల్ 16 : జన నీరాజనంతో టీడీపీ అభ్యర్థి వరద మంగళవారం చిన్నశెట్టిపల్లె గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామ నాయకులు వరదరాజుల రెడ్డిని పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి తనకు, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డికి సైకిలు గుర్తుకు ఓటు వేయాలని ఆయన ప్రజలను కోరారు. అదే విధంగా పొట్టిపాడు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో పొట్టు లక్ష్మీరెడ్డి, సూర్యనరసింహారెడ్డి, సూర్య ప్రతాప్‌రెడ్డి, జనార్ధనరెడ్డి, హరిచంద్రారెడ్డి, తారకనాథరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తోట మహేశ్వర్‌రెడ్డి, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, మానికింది ఖాదర్‌బాషా, కుమ్మరపల్లె వెంకట్రామిరెడ్డి, కొట్టాల జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళల సాధికారత సంక్షేమం సాధ్యం

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 16 : టీడీపీ ప్రభుత్వంలోనే మహిళల సాధికారత సంక్షేమం సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి కుమార్తె అనురాధ, భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి పేర్కొన్నారు. మంగ్లవారం స్థానిక 4 వవార్డు కాలనీలో టీడీపీ బీజేపీ జనసేన ఎన్డీయే కూటమి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర,మహిళా అధ్యక్షురాలు కుమారి, ఉపాధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, మొరళీ మోహన్,బోగాల లక్ష్మీనారాయణమ్మ, లక్ష్మీ,అలివేలు, అంజ నమ్మ,భానుమతి, భారతి, వెంకటసుబ్బమ్మ,హసీనా మాజీ కౌన్సిల్లర్లు కాకుమాని ఆనంద్, కామిశెట్టిబాబు, మార్తల సుధాకర్‌రెడ్డి, ధనియాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రాచమల్లు, బంగారురెడ్డిల దౌర్జన్యాలకు చెక్‌పెడతాం

ప్రొద్దుటూరు ఏప్రిల్ 16 : ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన బావమరిది బంగారురెడ్డిల దౌర్జన్యాలకు టీడీపీ చెక్‌పెడుతుందని అందుకు నంద్యాల వరదరాజులరెడ్డిని గెలిపించాలని మాజీఎంపీపీ రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. మంగ్లవారం మండల పరిధిలోని సోములవారిపల్లె పంచాయితీ 5,6,7 వార్డులలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వంగ నూరు మురళీధర్‌రెడ్డి, సాంబశివుడు, రాముడు భాస్కర్ ప్రసాద్, యనమల సుబ్బిరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, మోహన్‌రెడ్డి, షరీఫ్, ఖాసీం, రాజశేఖర్, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో అందరికీ ఇబ్బందులే'

మైలవరం, ఏప్రిల్ 16: వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడ్డారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదిపిరాళ్ల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వద్దిరాల, ధన్నవాడ గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి దేవగుడి నారాయణరెడ్డికి కమలం గుర్తుకు, కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి సైకిల్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాపిరెడ్డి, కొండయ్య, నాగేశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి, నరసింహులు, సూర్యపెద్దిరాజు, గోవింద్, నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆది, భూపేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

కొండాపురం, ఏప్రిల్ 16 : రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరఫున జమ్మలమడుగు ఎమ్మెల్యేగా ఆదినారాయణరెడ్డి, కడప ఎంపీగా భూపేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి కోరారు.మండలంలోని నేదరపేట,పి.అనంతపురం గ్రామంలో మంగళవారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి

గోపవరం, ఏప్రిల్ 16 : గోపవరం మండలం ఎరువులు, పురుగుమందులషాపుల డీలర్లకు ఏవో రామక్రిష్ణయ్య మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టాకు రిజిస్టరు, బిల్‌బుక్స్, నిల్వ ఇన్‌వాయిస్, పేబిల్స్, లైసెన్సు, బయోమెట్రిక్ ఈపాస్ తదితర అంశాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఏవో మాట్లాడుతూ ప్రతి రైతుకు తప్పనిసరిగా కొన్న మొత్తానికి బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి విజయకుమార్, డీలర్లు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి

జమ్మలమడుగు, ఏప్రిల్ 16: బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ కొనియాడారు. మంగళవారం జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డు పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ పీఆర్ హైస్కూలు ఆవరణంలో వీరశలింగం జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు ఎల్లయ్య, సభ్యులు పాల్గొన్నారు.

బద్వేలు..: నవయుగ వైతాళికులు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కేవి.సుబ్బారావు పేర్కొన్నారు. మం గళవారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో మహనీయుల జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ, పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కందుకూరి జయంతిని నిర్వహించారు. పూలే ఆశయసాధన సమి తి ఛైర్మన్ గురుమూర్తి, మొల్ల సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి గానుగపెంట మనోజ్‌కుమార్, కత్తి బ్రహ్మయ్య, సి.వి.నాగేశ్వరరావు, టి.రామసుబ్బయ్య యాదవ్ , పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

మైదుకూరు రూరల్ ఏప్రిల్16 : మండలంలోని తువ్వపల్లెలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు మంగళవారం ప్రొద్దుటూరులోని పార్టీ ఆఫీసులో మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో ఆ పార్టీలో చేరాయి. చేరిన వారిలో బొజ్జయ్య, రామసుబ్బారెడ్డి,వాసు,యల్లయ్య,వెంకటస్వామి,హరి,జనార్ధన్,తెల్లయ్యవెంకటయ్య,రాముడు,శ్రీరాములు,లక్ష్మయ్యరవి,శ్రీను,కర్ణ,రామచంద్ర,వెంకటేశ్,గుల్లలయ్యవెంకీ, సాగర్,వెంకటరమణ ఉన్నారు.ఈకార్యక్రమంలో నాయకులు రామచంద్రనాయుడు,కిషోర్,రమణ, కొండారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్,శిఖామణి,వెంకటయ్య,శ్రీరాం,గంగాధర్ పాల్గొన్నారు.

అవకాశం కల్పించండి



కూరగాయల వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 16 : ఒక్కసారి తనకు బద్వేలు నియోజకవర్గం స్థానం నుంచి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలుగుగంగ పెండింగు కాల్వల పనులు పూర్తి చేసి రైతాంగానికి పూర్తి స్థాయిలో నీరందేలా చేస్తామని బీజేపీ,టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న అన్నారు. మంగళవారం రోశన్న టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. శ్రీరామ్‌నగర్-1, 2, కొత్తవీధి ప్రాంతాల్లో ఎన్నికల మేనిఫెస్టో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

బద్వేలు రూరల్, ఏప్రిల్ 16 : ఎన్‌డీఏ కూటమిలో భాగంగా బద్వేలు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్నను గెలిపించాలని ఆయన సతీమణి బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి కోరారు. మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు, శ్రీక్రిష్ణదేవరాయనగర్ తదితర ప్రాంతాల్లో వారు ఇంటింటికీ వెళ్లి ఎన్డీఏ కూటమి కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ కరీమున్నీసా,నరసయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పోవాలంటే

కూటమిని గెలిపించాలి

బి.కోడూరు, ఏప్రిల్ 16 : రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పోవాలంటే కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నకు కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కూటమి అభ్యర్థులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, అభ్యర్థి రోశన్న, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధిలోని సిద్దుగారి పల్లె, ప్రభలవీడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్య క్రమంలో గోడి రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమర్‌నాధరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్

ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 16 : టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగ్లవారం సూపర్ బజార్‌నాలుగు రోడ్లలో జయహో బీసీ సభ జరిగింది. ఈ సభలో వరదరాజులరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక బీసీలు, ఆర్యవైశ్యుల ఆస్తులకు రక్షణలేకుండా పోయిందన్నారు. వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు అవినీతిని భూదందాలను ప్రశ్నించిన పద్మశాలీయ కులస్తుడైన బీసీ నాయకుడు నందం సుబ్బయ్యను అతికిరాతకంగా పట్టపగలు వందలాది మంది చూస్తుండగా నరికి చంపారన్నారు. ఈ కేసులో ఎమ్మెల్యే ఆయన బావమరుదుల పేర్లను పెట్టకుండా పోలీసులు తప్పించారన్నారు. బీసీ అయిన భీమునిపల్లె లక్ష్మీదేవికి ఛైర్‌పర్సన్ పదవిఇచ్చి ఆమెను కుర్చీకి, సంతకాలకు పరిమితం చేశారన్నారు. అధికారం అంతా ఎమ్మెల్యే రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి తమ గుప్పిట్లో పెట్టుకుని మున్సిపాలిటీ లో పెత్తనం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా వరదరాజులరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిని బలపరిచి టీడీపీ సైకిల్‌గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య,చౌడంవెంకటకొండయ్య,వద్దిబాలుడు, తాటిశ్రీనివాసులు యాదవ్, సోమా బాలయ్య, గంజికుంట క్రిష్ణవేణి, గంజికుంట ఆంజినేయులు, బోగా లక్ష్మీదేవి,బోగా కళ్యాణి, పల్లాశంకర్, బోగాపెద్ద వీరయ్య ,బోగా చిన్న వీరయ్య, నల్లబోతుల నాగరాజు, చల్లా రాజగోపాల్ యాదవ్, బొర్రా రామాంజనేయులు, సుంకర వేణుగోపాల్ ,చంగా సిద్దయ్య, సిరివేరి వెంకటసుబ్బయ్య, జీపీ పుల్లయ్య, శ్రీనివాసాచారి, జిలాన్, బోగా శివకళ్యాణి పాల్గొన్నారు.